# ఇస్మత్ చుగ్తాయ్ కథలు



# ఇస్మత్ చుగ్తాయ్ కథలు

తెలుగు అనువాదం : **పి సత్యవతి**

**హైదరాబాద్ బుక్ ట్రస్ట్**


| | | |
|---|---|---|
| ధర | : | 100/- |
| తొలి ముద్రణ | : | జూన్, 2012 |
| | | Originally published in an English translation by Kali for Women / Women Unlimited, New Delhi, as *The Quilt & Other Stories translated from urdu by Tahira naqvi and syed S. Hamed* |
| అట్టమీద బొమ్మ | : | శంకర్ |
| ప్రతులకు, వివరాలకు | : | హైదరాబాద్ బుక్ ట్రస్ట్,<br>ప్లాట్ నెం. 85, బాలాజీనగర్<br>గుడిమల్కాపూర్, హైదరాబాద్ – 500 006<br>ఫోన్ : 23521849<br>www.hyderabadbooktrust.blogspot.com |
| ముద్రణ | : | అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ,<br>126, శాంతినగర్, హైదరాబాద్ – 28<br>ఫోన్ : 23391364, 23304194<br>Email: anupamaprinters@yahoo.co.in |

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| | జీవన యాత్రలో ముళ్ళూ, పువ్వులూ | 6 |
| | పరిచయం..... | 19 |
| 1. | లిహాఫ్ | 27 |
| 2. | పుట్టుమచ్చ | 38 |
| 3.. | మేలిముసుగు | 50 |
| 4. | దేవుడి దయ | 55 |
| 5. | కల్లూ | 63 |
| 6. | అలముకున్న పరిమళం | 70 |
| 7. | శిల | 95 |
| 8. | ఒక ముద్ద | 107 |
| 9. | చేతులు | 117 |
| 10. | బిచ్చు అత్తయ్య | 126 |
| 11. | చిన్నక్క | 135 |
| 12. | పవిత్ర కర్తవ్యం | 141 |
| 13. | అమృతలత | 153 |
| 14. | గరళం | 163 |
| 15. | చౌతీ కా జోడా | 170 |


# ఇష్టంగా ఇస్మత్ కథలు

ఒక్కొక్క భాష నుడికారంలో ఒక్కొక్క రకం సౌందర్య పరిమళం వుంటుంది. అనువాదకులు మరొక భాషలో ఎంత నిష్ణాతులైనా, ఆ సౌందర్యాన్నీ, పరిమళాన్నీ నూటికి నూరు పాళ్ళు పట్టుకోలేరని నేననుకుంటాను. కనీసం డెబ్భై అయిదు శాతం అన్నా తీసుకురావాలని ప్రయత్నించాను. ఈ అనువాదం మూల భాషనుంచి నేరుగా రాకుండా మధ్య ఒక వాహకం ఉండడం కూడా కొంత ఇబ్బందికి కారణం అవుతుంది. అయినప్పటికీ ఇస్మత్ చుగ్తాయ్ పాత్రలూ, వాటి మనస్తత్వాలూ, ప్రవర్తనలూ మనకి కొత్తవి కావు. అవి మన సామాజిక సాంస్కృతిక జీవితంలో ఒక భాగం కనుక, చాలా ఆత్మీయ మైనవిగా, మన బంధువుల వలె అనిపిస్తాయి. తాదాత్మ్యత కలుగుతుంది. ముస్లిమ్ స్త్రీలయినా హిందూ స్త్రీలైనా మరొక మతానికి చెందిన వారైనా ఆమె వ్రాసిన కాలానికి కొంచెం అటూ ఇటూగా అలాంటి సమస్యల్నే ఎదుర్కున్నారు. స్త్రీలుగా అవే అనుభూతులని ఆవేదనలని పంచుకున్నారు. ఈ కథాసంకలనం అనువాదానికి పూనుకోకముందు అనేక సంకలనాల్లో వచ్చిన చుగ్తాయ్ కథలు రెండు,ఒక నవలిక మాత్రమే చదివి ఆమె వ్రాసిన కథల్లో ఆ రెండే గొప్పవి అనుకున్నాను. ఇలా చాలా మంది అనుకుంటారని ఈ ఆంగ్ల సంకలనానికి ముందుమాట వ్రాసిన తాహిరా నఖ్వీ కూడా అన్నారు. ఇందులో వున్న పదహేను కథల్లో అన్నీ కూడా ఆమె శిల్ప చాతుర్యం, తనెక్కడా తొణక కుండా ప్రేక్షక మాత్రంగా కథ చెబుతూ, ఆ కథని ఎట్లా అర్థం చేసుకోవాలన్న విషయాన్ని పాఠకుల వివేకానికి వదిలెయ్యడం ఇస్మత్ చుగ్తాయ్ ప్రత్యేకత. అతి విషాదకరమైన గోరీబీ గురించి చెప్పినా రుఖ్సానా గురించి చెప్పినా, ఉత్తమ గృహిణిగా మలచబడి ఆకారణంగా విడాకులు పొందిన వదినె గురించి చెప్పినా, అదే అండర్ టోన్ లో చెప్పడం,కథ నడుస్తూండగా మధ్యలో కల్పించుకుని రచయిత్రి వ్యాఖ్యలు చెయ్యకపోవడం కూడా ఆమె నిబ్బరానికొక మంచి ఉదాహరణ. అర్థ శతాబ్దం క్రిందట ఇంత అవగాహనతో శిల్ప నైపుణ్యంతో వ్రాయడం అబ్బురం. ముఖ్యంగా లిహాఫ్ కథ ముగింపులోనే ఆమె కథన కౌశలం స్పష్టమౌతుంది. ఒక చిన్నపిల్ల అవగాహన మేరకు ఈ కథ ఎలా ముగియాలో అలాగే ముగిసింది. చెప్ప దలిచిన విషయాన్ని నిస్సంకోచంగా చెప్పడమూ జరిగింది. అంతే కాని తాహిరా నఖ్వీ వ్రాసినట్లు ఆమెకు స్వలింగ సంపర్కంపై అవగాహన లేకపోవడం కాదు. స్త్రీల జీవితాలలో వివాహ వ్యవస్థా, సంప్రదాయాలూ, పితృస్వామ్యమూ కలిసికట్టుగా సృష్టించిన విధ్వంసం ఈ కథలనిండా పరుచుకుని వుంది. అంతా చదివేసి. పుస్తకం పక్కనపెట్టేసి, హాయిగా వుండడం కుదరదు. బేగమ్ జాన్, కుబ్రా తల్లి, కుబ్రా, ఆమె చెల్లీ, రుఖ్సానా, హలీమా, గోరీబీ, సరళాబెన్ బిచ్చూ అత్తయ్య, వదినె, షబ్నమ్ ఇల్లూడ్చే ముసలమ్మ, ఫర్హత్ అంతా చాలాకాలం మన చుట్టూ తిరుగుతూనే వుంటారు. రచయిత్రినీ రచననూ చాలా ఇష్ట పడి చేసిన అనువాదం కనుక చాలా సంతోషాన్నిచ్చింది నాకు.

**పి. సత్యవతి**

# జీవన యాత్రలో ముళ్ళూ, పువ్వులూ

హృదయంలేని మనిషొకరు ఒక నల్లటి బక్క పిల్లని బెత్తంతో నిర్దాక్షిణ్యంగా బాదుతున్నారు. అతనెవరో, దెబ్బలు తింటున్న ఆ అభాగ్యురాలెవరో కూడా తెలుసుకునే వయసు నాకు లేదు. కానీ నాకు బాగా ఏడుపొచ్చింది. బాగా ఏడ్చాను. ఆ లావాటి బెత్తం ఆ పిల్ల వీపు మీద చేసిన శబ్దం నాచెవులలోనే వుండిపోయి ఇప్పటికీ తరుచూ వినపడుతూ వుంటుంది.

నాకప్పుడర్థం అయింది పెద్దవాళ్ళు చిన్న వాళ్లని ఎప్పుడూ కొడతారు. బలవంతులు బలహీనులను హింసిస్తారు. బలవంతులు తలఎత్తుకు నిలబడతారు. బలహీనులు వాళ్ళ పాదాల కింద ధూళిలా అయిపోతారు అనిపించింది. నేను బలవంతులను అభిమానించి బలహీనులను ఏవగించుకోడం మొదలుపెట్టాను. అయినప్పటికీ నా లోలోపల నాకు తెలియని భావాలేవో దాగి వున్నాయి. ఒక గొప్ప భవనపు గోడలకి నాచుపట్టి చుట్టూ గడ్డీ గాదమూ మొలిచినప్పుడు నేను లోలోపల సంతోషించేదాన్ని. చిరునవ్వు వచ్చేది నాకు. అంతటి భవనాన్ని నాశనం చెయ్యగల శక్తి ఆ పిచ్చి గడ్డికి వుండటాన్ని చూస్తే సంభ్రమం కలిగేది.

మా అమ్మకి మేము చాలామంది పిల్లలం. మమ్మల్ని చూస్తేనే మా అమ్మకి వెగటు పుట్టేది. ఒకళ్ళ తరువాత ఒకరం ఆమె గర్భాన్ని తోసుకుంటూ తొక్కుకుంటూ వచ్చాం. ఆమెకెప్పుడూ, వుంటే గర్భమో లేకపోతే వేవిళ్ళో వుండేవి. అందుకోసం మాపట్ల అంత శ్రద్ధ చూపించేది కాదు. ఈ అశ్రద్ధ పెద్ద శిక్ష మాకు! చిన్న వయసులోనే ఆమెకి ఊబకాయం వచ్చేసింది. ముప్పై అయిదేళ్ళకే అమ్మమ్మ అయింది. మేము ఎక్కువ పనివాళ్ల సంరక్షణ లోనే పెరిగాము. వాళ్లతోనే ఎక్కువ సాన్నిహిత్యం మాకు.

నౌకర్లకి రెండు ముఖాలుంటాయి. యజమానుల సమక్షంలో వారిపట్ల అంతులేని వినయ విధేయతలు ప్రదర్శిస్తారు. పరోక్షంలో శాపనార్థాలు పెడుతూ వుంటారు. ఇళ్ళల్లో పనిచేసే పనిమనుషులంత దురదృష్టవంతులెవరూ ఉండరనుకుంటాను. ముఖ్యంగా పేదరికమూ, నిరుద్యోగమూ ప్రబలంగా వున్న భారతదేశంలో చాలామంది ఈ వర్గంలోనే వుంటారు.

మా ఇంట్లో కొంతమంది నౌకర్లు తరాల తరబడి వున్నారు. వాళ్ల శరీరాల్లాగే వాళ్ల మనసులుకూడా బానిసత్వంలో కూరుకుపోయాయి. వాళ్లని వెళ్లగొట్టినా మళ్ళీ గుమ్మం పట్టుకు వేళ్ళాడి పెంపుడు కుక్కలకు మల్లే ఈ పలుపు కే తమని తాము కట్టేసుకుంటారు.



ఇప్పుడు దేశం సాధించిన ఏ కాస్తో అభివృద్ధి వలన, నిరుద్యోగ పరిస్థితి కొంత చక్కబడడం వలనా, అప్పటి నౌకర్లలో వుండే బానిస మనస్తత్వం ఇప్పుడు అంతగా కనిపించదు. నా చిన్నప్పుడు నౌకర్లు బహు దయనీయమైన స్థితిలో వుండేవాళ్లు.నేను యజమానులనూ, నౌకర్ల వ్యవస్థనీ కూడా ఏవగించుకునే దాన్ని. నా కథలు చాలా వాటిలో ఇటువంటి నౌకర్లు కనిపిస్తారు. నిస్సహాయులు, బలహీనులు, కొంతమంది అబద్ధాల కోర్లు, మోసకార్లు, ఒకరితో ఒకరు కుమ్మక్కయేవారు, ఇట్లా ఎందరో! నా చిన్న పరిమిత ప్రపంచంలో యజమానీ నౌకర్ల సంబంధాలలో వుండే అంతరం స్పష్టంగా కనపడేది. నా ప్రపంచం స్పష్టమూ విస్తృతమూ అవుతున్నకొద్దీ ఈ అంతరం కావాలని కల్పించిందని తెలిసిపోయింది. అసలు విషయం ఒకటే. వున్నవాళ్లకి లేనివాళ్లకీ మధ్య వుండే సంఘర్షణ అది ప్రస్తుత లోకరీతి ... ధనవంతులు ఎంత జాతీయవాదులైనా, దైవ భక్తులైనా బీదవాళ్లని తమ నౌకర్లలాగే చూస్తారు. మమ్మల్ని పెంచిన తీరులో ప్రేమకూ వాత్సల్యానికీ తావేలేదు.వాటి గురించి ఏ కొంచమైనా నేర్చుకుంటే అది నౌకర్ల నుంచే.

మొహర్రం సందర్భంగా జరిగిన సంస్మరణ సభలో నేను మొదటి సారిగా "మార్సియా, నౌహా"ల గురించి తెలుసు కున్నాను. ఆలీ అస్ఘర్ గొంతులో బాణం గుచ్చుకున్న సన్నివేశాన్ని గురించి ప్రస్తావించినప్పుడు, నేను తట్టుకోలేకపోయాను. గట్టిగా ఏడవడం మొదలుపెట్టాను. సభలో సంతాపం తెలిపే స్త్రీలు నన్ను ఆశ్చర్యంగా చూశారు. "తబర్రుక్" కోసం చాలా సేపు ఎదురు చూడవలసి వచ్చినందున ఆకలికి తాళ లేక నేనలా ఏడుస్తున్నానో, ఎక్కడైనా దెబ్బతగిలి ఏడుస్తున్నానో, ఏ పురుగైనా కుట్టిందో అనుకున్నారు వాళ్ళు.

"ఎందుకు అతని గొంతులోకి బాణం వేశారు?ఎందుకు? ఎందుకు?" నేను చాలా ఆందోళన పడిపోయాను. నా ప్రశ్నకెవరూ సమాధానం చెప్పలేదు. నేనేదో ఉద్వేగంలో అలా ప్రవర్తిస్తున్నానని అక్కడినించి పంపేశారు. ఇంటికొచ్చాక మా అన్నలు నేను సభలో అసభ్యంగా ప్రవర్తించి తమను తల వంచుకునేలా చేశానని చెప్పారు. నన్ను బాగా అవమానించారు.

"బాణం గొంతులోకి ఎందుకు వెయ్యాలి? చేతిమీద వెయ్యచ్చు కదా?పాపం అతను." అని మళ్ళీ మొండిగా అడిగాను నేను.

"చేసింది చాలు. నోర్మూసుకుని పోయి పడుకుని నిద్రపో!!" అని బాగా తిట్టారు.

కానీ నాకు నిద్రవచ్చింది కాదు. కళ్ళుమూసుకోగానే గొంతులో బాణంతో ఆ పిల్ల వాడే ప్రత్యక్షమయేవాడు.

"నిద్రపోతావా లేదా? లేకపోతే గొంతుపిసుకుతాం!!" అని ఒకళ్ళతరువాత ఒకళ్ళు కోప్పడుతున్నారు. కానీ నాకు ఏడుపు ఆగడం లేదు. అప్పుడు ఒక్కదాన్నీ పడుకోడానికి భయమేసి షేకానీ బువా దగ్గరకు వెళ్ళాను.

"ఎందుకతని గొంతులో బాణం వేశారు?" అని ఏడుస్తూ అడిగాను. "ఆ పిల్ల వాణ్ణి అక్కడికెందుకు తీసుకు వెళ్ళారు?"

"వాడికి దాహం వేసింది"

"వాడికి పాలు ఇవ్వవలసింది"

"వాళ్ళమ్మ దగ్గర పాలు లేవు"

"మరి అప్పుడు నీళ్ళెందుకివ్వలేదు?"

"నీళ్ళెక్కడున్నాయి? శత్రు సైన్యం కాలువకి కాపలా కాస్తోంది. అక్కడేదో జరిగివుంటుంది"

"ఎందుకు"?

"ఏమో నాకేం తెలుసు?"

"అయితే"

"ఆ పిల్ల వాడికి నీళ్ళు తాగించడానికి కాలువ దగ్గరకు తీసుకు వెళ్ళారు. అందుకని బాణం వేశారు"

"గొంతులోనా?"

"..అవును గొంతులోనే."

అప్పుడు నా గొంతులో కూడా ఒక ముళ్ళబంతి అడ్డంపడ్డట్లయింది

"బాణం బాణం అంటూ తనూ నిద్రపోదు! ఎదుటివాళ్లనీ నిద్రపోనీదీ పిల్ల" అంటూ మా అమ్మ నా చెంప మీద కొట్టిన దెబ్బకి క్రింద పడిపోయాను నేను.

చాలా కాలం దాకా ఈ విషయం చెప్పుకుని నవ్వుకునే వాళ్ళు మాఇంట్లో. ఇంటికెవరొచ్చినా మా అన్నలు "మొహర్రం అప్పుడు ఈ పిల్ల అందరిలో గట్టిగా ఏడ్చేసింది. అప్పుడు మా అమ్మ బాగా కొట్టింది" అని చెప్పేవాళ్ళు. నేను సిగ్గుతో తల దించుకునేదాన్ని.

ఇది నా జీవితంలో మొదటి ముఖ్యమైన పాఠం. దాని ప్రభావం నన్ను చాలా కాలం వెంటాడింది. ఇటువంటి సమావేశాలకి వెళ్ళడానికి చాలా భయపడేదాన్ని. ఆ పిల్ల వాడి మెడ మీద బాణం ఎప్పుడూ నా వంక చూసినట్లే వుండేది. నా గొంతులో ముళ్ళ బంతి గుచ్చుకున్నట్టే వుండేది. సమావేశాల పవిత్రత పోయింది.

కొన్ని సంవత్సరాల క్రిందట నేను హిట్లర్ దుష్కృత్యాలను గురించిన సినిమా ఒకటి చూశాను. ఆ సినిమాలోని లక్షలాది శవాలను చూసినప్పుడు మళ్ళీ నా గొంతులో ఆ ముళ్ళ బంతే గుచ్చుకుంది. పన్నెండు సంవత్సరాల పాటు వియత్నాంలో రక్త తర్పణం



జరిగింది. ఎవరూ ఎందుకు ఆపలేదు దాన్ని?ఎంతకాలం మానవాళి ఇటువంటి ఘాతుకాలకు నిస్సహాయంగా మూగ ప్రేక్షకత్వం వహిస్తుంది? మనిషి మనిషిని పీక్కుతినడం మానుకున్నాడే కానీ అతని మాంసాన్ని ఆస్వాదిస్తూనే వున్నాడు. జీర్ణం చేసుకుంటూనే వున్నాడు. ఇటువంటి ప్రపంచాన్ని నేను ప్రేమించలేను. నాకు ఇటువంటి సిద్ధాంతాలంటే అసహ్యం.

నా బాల్యంలో జరిగిన మరొక సంఘటన నేనెప్పటికీ మర్చిపోలేను. అది నన్ను గాఢంగా ప్రభావితం చేసింది. మా నాన్న అభ్యుదయ భావాలు కలవారు. ఆయన హిందువులతో సత్సంబంధాలు నెరిపేవారు. ఒక వర్గానికి చెందిన కొంతమంది హిందూ ముస్లిములు సన్నిహితంగా వుండేవారు. అయినప్పటికీ, హిందూ ముస్లిముల మధ్య సహజంగానే ఏదో దూరం వుందని పించేది. సౌభ్రాతృత్వాన్ని గట్టిగా ప్రదర్శించడాన్ని నిగ్రహించుకోడం తెలిసేది. మా ఇంటికి హిందువులెవరైనా భోజనానికి వస్తే "మాంసం" అనే మాటే ఎత్తకూడదు. ఒకే టేబిల్ మీద తింటున్నా, వాళ్ళ ఆహారాన్ని మేము ముట్టుకోకూడదు. మా నౌకర్లే భోజనాన్ని టేబిల్ మీదకి చేర్చినా, మా పొరుగు వాళ్ళ నౌకరు వాళ్ళకి వడ్డించేవాడు. ఆ పదార్థాలు పెట్టే గిన్నెలు కూడా పక్కింటినించీ తెచ్చేవారు. పొగబెట్టినట్లుండేది. ఒక పక్క తప్పంతా బ్రిటిష్ వాళ్ళదే అన్నట్లు ఎంతో అభ్యుదయభావాల్తో మాట్లాడేవారు. ప్రేమాభిమానాలను ఇచ్చిపుచ్చుకునేవారు. మరొక పక్క తమ పిల్లలు మత ధర్మాలను ఎక్కడ అతిక్రమిస్తారో అని భయపడేవారు.

మేము పిల్లలం పెద్దవాళ్ళు చూడకుండా ఒకే పండుని కొరుక్కుని తినేవాళ్ళం. సుశి మా ఇంట్లో బిస్కెట్లూ పళ్ళూ పిండివంటలూ తింటూ వుండేది. అవి మైల పడవని వాళ్ళ ఉద్దేశం. తను పూర్తిగా శాకాహారి అని తెలిసి మేము ఆమె చేత మాయచేసి ఎలాగైనా మాంసం తినిపించాలనుకునేవాళ్ళం. మామూలుగా మేమిద్దరం ఎప్పుడూ ఒకరింట్లో ఒకరం వుండేవాళ్ళం కానీ బక్రీద్ సమయంలో తనని మా ఇంటికి రానిచ్చేవాళ్ళు కాదు.

వాళ్ళింట్లో జరిగే కృష్ణాష్టమి వేడుకలు నన్నెంతో ఆకర్షించాయి. వాళ్ళ పూజగదిలో వెండి ఉయ్యాలమీద ఒక అందమైన పిల్లవాడు కృష్ణుడిలా అలంకరించుకుని కూర్చుని వున్నాడు. వెళ్ళి అతగాడి బుగ్గలు పుణికి ఎత్తుకుందామనుకుంటే వాడొక్క సారిగా ఏడ్చి కిందపడిపోయాడు.వాళ్ళు నన్ను చచ్చిపోయిన బల్లిని విసిరేసినట్లు ఇంట్లోనించి విసిరేసి మా పెద్ద వాళ్ళకి నామీద ఫిర్యాదు చేశారు. మా వాళ్ళు నన్ను బాగా కొట్టి విగ్రహారాధన ఎంత పాపమో నా చెవికెక్కించడానికి ప్రయత్నించారు. ఇస్లామ్ ప్రాముఖ్యత గురించి చెప్పారు. పరలోకంలో సుఖంగా వుండాలంటే ఇస్లామ్‌ను పాటించడం ఎంత ముఖ్యమో

చెప్పారు. మా నాన్న సిద్ధాంత రీత్యా మగ పిల్లలకన్న ఆడపిల్లల హక్కులకే ఎక్కువ ప్రాముఖ్యమివ్వాలనే ఉదార వాది. కానీ ముస్లిములలో కానీ హిందువులలో కానీ ఆడపిల్లల పరిస్థితి ఒకటే. ఆడపిల్లలూ మగపిల్లలూ సమానమే అనేది కేవలం కంటితుడుపు నినాదం మాత్రమే ఎక్కడైనా!.

నేను పెద్దదాన్ని కాకముందే మా ముగ్గురు అక్కలకు పెళ్ళిళ్ళయిపోయాయి. ఎక్కువమంది అబ్బాయిల మధ్య నేనొక్క దాన్నే ఆడపిల్లని మిగిలాను. ఎప్పుడు నా హక్కులకు భంగం కలిగితే, అప్పుడు నా కేసుని మా తాత గారి కోర్టుకు తీసుకుపోయేదాన్ని.

మా అక్కలు చాలా సమర్థులు. ఉర్దూ, పర్షియన్‌లే కాక ఖురాన్ షరీఫ్ కూడా చదివారు. కుట్లు అల్లికలు, ఎంబ్రాయిడరీ, వంట అన్నీ నేర్చుకున్నారు. నేను అందుకు భిన్నం. వీటిలో ఏవీ రాలేదు నాకు. వీటిలో ఆసక్తి లేదు నాకు పైగా కోరికలు అణచిపెట్టుకునే గుణమూ లేదు. అందుకని నేను చెట్లెక్కడం, మగపిల్లలతో పాటు సైకిల్ పందాలకు దిగడం లాంటి "మగ పిల్లల పనులు" చేసేదాన్ని. కానీ నాకెప్పుడూ శృంగభంగమే ఎదురయ్యేది. మా అన్నలతో పోలిస్తే నాకు నిలకడ తక్కువ. అయినా వాళ్ళెందుకు నా మీద జాలిపడాలి? మా నాన్నగారి మద్దతుతో నేను వాళ్లతో సమానంగా వుండడానికి ప్రయత్నించేదాన్ని. ఉదాహరణకి, మా అన్నలిద్దరూ వంతుల వారీగా గుర్రపుస్వారీ చేసేవారు. కానీ నేను గుర్రం ఎక్కితే మాత్రం గొణిగేవాళ్ళు. ఇక వాళ్లతో బిళ్ళంగోడు ఆడితే ఘోరంగా ఓడిపోయేదాన్ని. ఫుట్బాల్ ఆడాలని పట్టుబడితే మొహం మీదకి బంతి తన్నేవాళ్ళు. మా అన్నలు నా మొండితనాన్ని గురించి అస్తమానమూ ఫిర్యాదులు చేసేవాళ్ళు. పెళ్ళికాకముందు మా అక్కల పెత్తనం బాగా వుండేది. గోడౌన్ తాళం చెవులు వాళ్ళదగ్గర వుండేవి. అట్లా మా సోదరులని వాళ్ళు అదుపు చేసేవాళ్ళు. కానీ నేను మాత్రం వాళ్లకి తలనొప్పిగా మారాను.

మా అన్న అజీమ్ బేగ్ చుగ్తాయ్‌కి శరీర ధారుఢ్యం తక్కువ. అందుకని అతను ఎక్కువ శారీరక శ్రమ చెయ్యలేకపోయేవాడు. నేనేమో ఆడపిల్లను కనుక చెయ్యలేకపోయేదాన్ని. అతనికి నామీద జాలికలిగింది. "మగపిల్లలు ఎద్దుల్లాంటివాళ్ళు. నువ్వు కూడా ఒక ఎద్దువి ఎందుకవ్వాలనుకుంటావు? వాళ్లతో చదువులో పోటీ పడు. అక్కడ వాళ్ళని ఓడించు" అని చెప్పాడు.

అతను నాకంటే ఒక సంవత్సరంన్నర మాత్రమే పెద్దవాడు. కానీ నాకన్న మూడు క్లాసులు ముందున్నాడు. శ్రమ తీసుకుని నాకు చదువు చెప్పడం మొదలుపెట్టాడు. తరువాత నాకు వరసగా రెండుసార్లు డబల్ ప్రమోషన్లొచ్చాయి. అందరికన్న పెద్దన్న ఒక సారి పరీక్ష తప్పాడు. అందుకని ఇద్దరం ఒకే క్లాసులోకి వచ్చాం. నేనతనికి హోం వర్క్‌లో



సాయపడేదాన్ని. నాకప్పుడు తెలిసింది, అతనికంటె నేనే బాగా చదువుతున్నానని. అజీమ్ బేగ్ చుగ్తాయ్ ప్రోత్సాహంతో నేను ఖురాన్ అనువాదం, ముస్లిమ్ చరిత్ర, వార్తాపత్రికలూ చదవడం ప్రారంభించాను. మా నాన్నగారి స్నేహితుల సమక్షంలో నా కొత్త జ్ఞానాన్ని ప్రదర్శిస్తూ వుండేదాన్ని. మా అమ్మ ఇదంతా చూసి నిర్ఘాంతపోయేది. నన్ను శిక్షించాలనుకునేది. కానీ మా తాతగారి ప్రోత్సాహంతో నేను మానాన్నగారిమిత్రుల సంభాషణల నుంచి చాలా తెలుసుకునేదాన్ని.

మా అమ్మకి నా కార్యకలాపాలు నచ్చేవి కావు. నా భవిష్యత్తుగురించి భయపడుతున్నాననేది. మగవాళ్లు చేయవలసిన పనులు (చదువుకోడం, చర్చించడం) ఆడపిల్లలకు తగదనేది. మా అమ్మ ఇంతగా భయపడడానికి కారణం నాకు తరువాత తెలిసింది. "ఇది పురుషుల కోసం పురుషులు తయారుచేసిన ప్రపంచం. ఈ ప్రపంచంలో స్త్రీ ఒక పాత్ర మాత్రమే. పురుషుని ప్రేమకో ద్వేషానికో ఒక అభివ్యక్తిలాంటిది స్త్రీ. అతని చిత్తవృత్తులను బట్టి ఆమెను ప్రేమించడమో తిరస్కరించడమో జరుగుతుంది. స్త్రీలు తమ లక్ష్యాలను సాధించుకోవాలంటే కొన్ని యుక్తులు నేర్చుకోవాలి. ఓర్పు, చాకచక్యం తెలివీ, మేధా, కలిగి పురుషుడెప్పుడూ తనమీద ఆధారపడేలా చేసుకోవాలి. అతని షర్టు గుండీలు కుడుతూ కులకాలి. రొట్టెలు చేస్తూనే చివరి శ్వాస విడవాలి. నౌకర్లతో అయ్యే చిన్నచిన్న పనులుకూడా స్వయంగా చెయ్యాలి. అతను చేసే దుర్మార్గపు చేష్టలకుకూడా తలవంచి అతను సిగ్గుపడేలా చేసి తన పాదాల దగ్గరకు తెచ్చుకోవాలి" అంటుంది అమ్మ.

కానీ నేను మా అన్నల సహచర్యంలోనే గడిపాను. వాళ్లతోనే పోటీ పడ్డాను వాళ్లపై విజయం సాధించాను. అమ్మ చెప్పే స్త్రీత్వం ఒట్టి బూటకం నాదృష్టిలో ఈ పిరికితనం, అలసత్వం, కాపట్యం, లాంటి మోసపూరితమైన పనులునచ్చవు నాకు. మేకప్ వేసుకోడం, ఆడంబరమైన దుస్తులు ధరించడం కూడా లోపాలని కప్పిపుచ్చుకోడానికో మోసం చెయ్యడానికో అన్నట్లుంటుంది నాకు.

"ఇటువంటి పిల్ల కేసి ఏ మగవాడూ చూడడు" అని నాస్నేహితులు అనేవారు. నేను వాళ్లు చెప్పింది అర్థం చేసుకోడానికి ప్రయత్నించేదాన్ని. మా అన్నలు నావెంటపడ్డారు. వాళ్లు అనదలచుకున్నవన్నీ అనేవాళ్ళు. నేను నిర్మొహమాటంగా మాట్లాడితే వాళ్ళింకా నిర్మొహమాటంగా మాట్లాడేవాళ్లు. నేను మగపిల్లల్ని ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నాననే వాళ్లు. అసలు నేను మేకప్ వేసుకుంటానని ఎలా అనుకుంటాను? అంతేకాదు నా అనుభవంతో నేను తెలుసుకున్నదేమిటంటే అసలు మేకప్ వేసుకోవాల్సిన అవసరమే లేదు. అది వేసుకోకుండానే నాకు చాలామంది స్నేహితులుండేవాళ్లు. నేను రష్యాలో

కలసిన కొంతమంది అమ్మాయిలు ఇలాంటి కృత్రిమ వేషాలపట్ల అయిష్టత ప్రకటించారు. వాళ్ళు చాలాసాధారణమైన దుస్తులు వేసుకున్నారు. సౌందర్యోపకరణాలు ఎందుకు వాడరని అడిగితే, “ఆ అవసరం అనిపించలేదు. ఏం, ఇలా బాగాలేనా నేను?” అంది ఒకమ్మాయి.

“అప్పుడింకా బాగా వుంటావు కదా?” అన్నాను.

“నా అసలైన రూపాన్నే చూపించుకోడం ఇష్టం నాకు. నా స్త్రీత్వమే నాకు అందం” అని, చాలా విశ్వాసంతో చెప్పింది.

యూరప్‌లో యువతులకి కూడా ఇలాంటి కృత్రిమ అలంకరణలపట్ల విసుగొచ్చింది. ఒక పురుషుడు, పురుషుడిగా, ఒక స్త్రీ, స్త్రీగా వుంటే వారిద్దరి మధ్యా ఒక పారదర్శకమైన సంబంధం వుంటుంది కదా? నేను రష్యన్ యువతుల వలన చాలా ప్రభావితురాలినైనాను. నా కథలలో స్త్రీల దైన్యానికి ఆర్థిక పరాధీనతే కారణమని చాలా చోట్ల చిత్రించాను. ఆర్థికంగా పురుషుల మీద ఆధారపడడం వలననే అతనికి లొంగి వుండడం అంటే అది మోసమే కానీ విధేయత కాదు. కేవలం తిండి కోసమే భర్త మీద ఆధార పడ్డ స్త్రీ వేశ్య వంటిది. అటువంటి స్త్రీ, లొంగుబాటు మనస్తత్వం కల పిల్లలకు జన్మనిస్తుంది. ఆ పిల్లలు ఎప్పటికీ లొంగుబాటు మనస్తత్వం తోనే వుంటారు. ఈ దేశంలో స్త్రీలు నిస్సహాయులుగా, అధీనులుగా తలవంచుకు పోతున్నంత కాలం, మనం రాజకీయంగా ఆర్థికంగా ఆత్మన్యూనతకు గురౌతూనేవుంటాం. రషీదాజహాన్ నన్నెంతో ప్రభావితం చేసింది. ఆమెనుంచి నేను నిష్కాపట్యం, స్వయం ఆధారితంగా వుండడం నేర్చుకున్నాను.

నా బాల్యంలో నాకు మంగు అనే స్నేహితురాలు వుండేది. మా గుర్రపు బగ్గీ సారథి కూతురు. నాకన్న కాస్త పెద్దది. మంచి హుషారుగా ఆత్మ విశ్వాసంతో వుండేది. ఆమెకి పదమూడు పధ్నాలుగేళ్ళకే పెళ్ళయి లక్నో వెళ్ళిపోయింది. తనకి కూతురు పుట్టిన తరువాత పుట్టింటికి వచ్చినప్పుడు చాలా నిస్తేజంగా కనపడింది. ఆమె చలాకీ తనమంతా పోయింది. ఆఖరికి చిరునవ్వులుకూడా మాయమైపోయాయి. ఆడపిల్లని కన్న నేరానికి ఆమెను అత్తగారూ, భర్తకూడా బాగా కొట్టేవాళ్ళు. మంగుకి మూడోసారి కూడా ఆడపిల్లే పుట్టింది.అప్పటికి మా నాన్నగారు రిటైరై ఆగ్రా వచ్చేశారు. ఆగ్రాలో స్త్రీల పరిస్థితి చూస్తే నాకు ఊపిరాడేది కాదు. మా పొరుగునున్న స్త్రీలంతా బక్కచిక్కి వుండేవాళ్ళు. అత్తలచేతిలో ఆడబడుచుల చేతిలో, భర్త చేతిలో హింస పడీ పడీ క్షయవ్యాధిగ్రస్థుల్లా వుండేవాళ్ళు. అయితే తాయెత్తులూ మంత్రాలూ అంటూ ఎలాగో నెట్టుకొచ్చేవాళ్ళు. నాకు నా స్త్రీత్వమంటేనే ద్వేషం కలగ సాగింది,

మంగుకి కూడా క్షయ వ్యాధి సోకినట్లుంది. ఆమె అత్తగారు కొడుక్కి వేరే పెళ్ళి చెయ్యాలని ఆలోచన చేస్తోంది. మగ పిల్లల కోసం. అప్పుడు మంగూని, ఆమె ముగ్గురు



కూతుళ్ళనీ భరించడం ఎట్లా అని ఆమె తల్లితండ్రులు తల్లడిల్లి పోతున్నారు. స్త్రీలకు అసలు విలువే లేదనడానికి మంగూ ముగ్గురు కూతుళ్ళే ఉదాహరణ. భగవంతుడు స్త్రీలకు చేస్తున్న అన్యాయం మీద నాకు చాలా కోపంవచ్చింది. ఎలాగైనా నేను అబ్బాయిగా మారితే బావుండుననుకునేదాన్ని.

లక్నో పోలీస్ సూపరింటెండెంట్ ద్వారా మంగు భర్తని బెదిరించారు మా నాన్నగారు. మరొక పెళ్ళి చేసుకుంటే జైల్లో పెడతానని.

తరువాతొకసారి మంగూ పుట్టింటికి వచ్చినప్పుడు ఆమె రూపే మారిపోయింది. ఆరోగ్యంగా ఆనందంగా కనపడింది. ఇప్పుడామెకు దయ్యం పట్టిందట. ఆ దయ్యం ఆమె శరీరంలో ప్రవేశించి ఆమె అత్తను కొడుతుందట. ఒక సారి ఆమె భర్తను కొరికిందట కూడా. భూతవైద్యుడిని పిలిపించి అడిగితే, అసలు అత్తగారే దీనికి కారణమని చెప్పాడట. అత్తగారు కనుక ఇంకా వాళ్ళతోనే వుంటే మంగుకి ఏడుగురు ఆడపిల్లలు పుడతారని చెప్పాడట భూతవైద్యుడు. అందుకని మంగూ భర్త కొత్త ఉద్యోగం వెతుక్కుని దాలీగంజ్ కి సంసారం మార్చుకున్నాడు. అప్పుడర్థం అయిందినాకు.మంగుకి చదువులేదు అక్షరాలైనా రావు.కానీ తను మూర్ఖురాలు మాత్రం కాదు. స్త్రీలు శారీరకంగా ఆర్థికంగా బలహీనులే కానీ తెలివి హీనులు కారు. మంగు తన సమస్యనుంచి చాకచక్యంగా బయట పడింది. నాకు ఆడపిల్లనన్న ఆత్మ న్యూనత పోయింది. అబ్బాయే కానక్కర్లేదు. ఎవరికైనా తెలివి వుండాలి, అంతే అనుకున్నాను. ఇంక అప్పటినించీ కుట్లూ అల్లికలూ వంటివన్నీ కట్టిపెట్టి శ్రద్ధగా చదవడం మొదలుపెట్టాను.

మాది అభ్యుదయ భావాలు కల కుటుంబమే. అయితే ఆ భావాలు మగపిల్లలకే పరిమితం. నేను కేవలం ఆడపిల్లను మాత్రమే! ఇంట్లో స్త్రీలందరూ ఎప్పుడూ భయపడుతూ వుండేవారు. అమ్మ, అత్త, అక్క అందరికీ మగవాళ్లంటే భయమే. సమాజం స్త్రీలనొక స్థానానికి పరిమితం చేసింది. ఆ పరిధి దాటితే దానికి శిక్ష అనుభవించాల్సిందే! ఆడపిల్లలకి ఎక్కువ చదువు ప్రమాదకరం.

మా ఇంట్లో మాట్లాడుకోడానికి స్వేచ్ఛ వుంది. కానీ అది మగవాళ్లకే. అదే స్వేచ్ఛకు నేను ప్రయత్నిస్తే నాకు తిట్లు తప్పవు. కానీ ఏదో ఒక కారణం చేత అజీమ్ భాయ్ నన్ను ప్రోత్సహించేవాడు. అతను గంభీరమైన వ్రాతలు మానేసి కథలు వ్రాయడం ప్రారంభించాడు. గంభీరమైన వ్రాతలద్వారా సాధించలేనిది కథల ద్వారా సాధించగలిగాడు. అతని కథల్లో నాయికలు, పెంకిపిల్లలు, చిలిపివాళ్ళు, ఆకర్షణ కలవాళ్ళు. అప్పుడు నాకర్థమైంది. చెప్పదలిచిన విషయాన్ని సూటిగా వ్యాసరూపంలో కాక, కథలా మలిచి చెప్పడం వలన తక్కువ విమర్శలొస్తాయని, ఎక్కువమంది చదువుతారనీ. ఎక్కువమంది ప్రభావితులౌతారని!

నేను చాలా వ్యాసాలు వ్రాసాను.కానీ ఎవరూ పట్టించుకోలేదు. కానీ ఒకటి రెండు కథలు వ్రాయగానే పాఠకులతో పారస్పర్యం లభించింది. అంతేకాదు. టెలిఫోన్‌లో లాగా కథలో ఏమైనాచెప్పొచ్చు. ఎవరికీ మన చెంప మీద కొట్టే అవకాశం దొరకదు.

మొదట్లో నాకు పాఠకుల స్పందన ఎట్లా తెలుసుకోవాలో తెలీలేదు. అప్పుడు నేను "సాఖి" లో మాత్రమే వ్రాసేదాన్ని. వాళ్ళు నా కొచ్చిన లేఖల్ని నాకు పంపేవారు కాదు. అన్నీ పారేసేవారు. నా వివాహం తరువాత ప్రచురణ అయిన మొదటి కథ "లిహాఫ్". ఆ కథ పై వచ్చిన ఉత్తరాలన్నీ నాకు అందచేశారు. ఎందుకంటే షాహీద్ అహ్మద్ సాబ్ (నా భర్త) నేనొక బాధ్యతగల వ్యక్తినని గుర్తించారు కనుక. ఆ ఉత్తరాల ధోరణి భీతిగొలిపేలా వుండి మొదట్లో నాకు చెమటలు పోసేవి. నిభాయించుకుని, నాకలం పగ్గాలు గట్టిగా పట్టుకున్నాను. మరెన్నడూ సడలించలేదు వాటిని. ఆ తరువాతెప్పుడూ వెనక్కి తగ్గలేదు. మరి నేను పెరిగిన పరిసరాలెలాంటివి? నిర్మొహమాటంగా వుండడం నా అలవాటు. దాన్ని నేను మానుకోలేను. నన్నెవరు దూషించినా ప్రతిస్పందించను. ఎంత తీవ్ర విమర్శనైనా ఎదుర్కోగలను. విమర్శించిన వారిపై ద్వేషం పెంచుకోను. వాళ్ళతో సామరస్యంగా కూర్చుని మాట్లాడతాను.

నామీద పుస్తకాల ప్రభావం చాలాఎక్కువ. చదివిన ప్రతి పుస్తకంనుంచీ ఏదో ఒకటి గ్రహిస్తాను. నా సమస్యలకు వాటిలో పరిష్కారాలు వెతుకుతాను. కొన్నిసార్లు లభించాయి కూడా!! పుస్తకాలు నా ప్రియతమ నేస్తాలు, నన్ను చింతలనుంచీ మళ్ళించిన అమృత హస్తాలు. తీవ్రమైన ఆశాభంగాలను, ఎన్నో చీకటి వేళలను భరించే శక్తినిచ్చిన అపురూప నేస్తాలు, నాకు నా పుస్తకాలు. ప్రతి రచయితలోనూ నాకొక బంధువు కనిపించేవారు. ఎంతమందినని జాబితా వెయ్యను? హార్డితో మొదలై, బ్రాంటీ సోదరీమణులు, మరికొందరి మీదుగా బెర్నార్డ్‌షాని చేరాను. కానీ రష్యన్ సాహితీ వేత్తల నుంచి పొందినంత స్ఫూర్తి మరెవరినించీ పొందలేదు. నన్ను వెలుగుదారిలో నడిపించే మార్గదర్శకత్వం కోసం వెతుకుతున్నప్పుడు, నాకు ప్రాప్తించిన అదృష్టం రష్యన్ సాహితీవేత్తలు. ఎండిపోయన రాజకీయ తత్వశాస్త్రంలో నేను వెతికిన జవాబులు కానరాక పోయినప్పుడు, నేను రష్యన్ సాహిత్యాన్ని జీర్ణించుకున్నాను. ఇప్పటికి కూడా చెకోవ్‌ని చదువుతాను నేను. అంతేకాదు నేను వ్రాసే కథకు ఆరంభమూ అంతమూ ఎట్లా వుండాలి అని తడుముకునే వేళ, మేధో వ్యాయామంలాగా మళ్ళీ చెకోవ్ కథలు కొన్ని చదువుతాను. వెంటనే నా సృజన మేల్కొంటుంది. నా కలం పరిగెడుతుంది.

మా కుటుంబం అంతా ఎక్కువ మాట్లాడేవాళ్ళే. ఇద్దరు, ముగ్గురు ఒక చోట చేరారంటే సమయాన్ని మర్చిపోతారు. నాకు కూడా అందరితో మాట్లాడ్డం ఇష్టం.



దుకాణదార్లు, టాక్సీ డ్రైవర్లు, ఆఖరికి బిచ్చగాళ్లతో కూడా మాట్లాడతాను. వృద్ధులను ఆటపట్టించడం, వాళ్ల తిట్లూ, శాపనార్థాలూ భరించడం నాకొకరకం ఆనందాన్నిస్తుంది. చదుకున్న వాళ్ళే అవసరం లేదు చదువులేని సామాన్య జనం కూడా నా మనోకవాటాలు తెరవగలరు. ఒక వ్యక్తిని అర్థం చేసుకోవాలంటే తప్పకుండా ఆ వ్యక్తితో మాట్లాడితీరాలి. ఇప్పుడు నాకు మాట్లాడ్డం ఎంత బాగా వచ్చంటే అయిదు నిమిషాల్లో ఏవ్యక్తి నుంచైనా వారిజీవిత కథ పట్టేస్తాను. చిన్న చిన్న సూటి ప్రశ్నలు చాలు మనకి అవసరమైన సమాచారం మొత్తం రాబట్టుకోడానికి.

మాట్లాడ్డం నిజంగా ఒక ఆసక్తికరమైన కార్యకలాపం. నేను సఫియా జాన్ నసార్‌తో మాట్లాడినంతగా, కొన్నేళ్ళుగా ఎవరితోనూ మాట్లాడలేదు. మంటోతో మాట్లాడితే ఆలోచనల్లో చురుకుదనం పెరుగుతుంది. ఆయనతో ఎవరైనా ఆరేడు గంటలు మాట్లాడగలరు. ఆయన భార్య సఫియా కూడా బాగా మాట్లాడుతుంది. ఇక సుల్తానా జాఫ్రీతో ముచ్చట్లాడటం చాలా తేలిక. ఆలీ సర్దార్ జాఫ్రీతో మామూలు విషయాలు చర్చించవచ్చు, చతుర్లు విసురుకోవచ్చు. ఆయనఎంత చేదు విమర్శలు చేస్తారో అంత మార్దవం, మాధుర్యం వొలికించగలడు. ఆయన ఎవరినైనా విమర్శించదలుచుకుంటే వాళ్లకి కన్నీళ్ళొచ్చే దాకా విశ్రమించని రోజులున్నాయి. ఖుద్సియా జైదీ తో ఎక్కువ మాట్లాడలేము. అట్లాగే సల్మా సిద్దీఖీతో మాట్లాడడం పరిమళాన్ని ఆస్వాదించినట్లే వుంటుంది. ఆనీ చాలా వేగంగా మాట్లాడుతుంది. తను మాట్లాడవలసింది చాలావుందన్నట్లు, సమయం దాటిపోతోంద న్నట్లు గబగబ మాట్లాడుతుంది. మాట్లాడే విషయంలో మా పిన్ని కూతుళ్ళు అక్తర్, జమీలాలకు ఎవరూ సాటిరారు. వాళ్ల ఎదుట సామాన్యులు మూగవాళ్లలా కనిపిస్తారు. వాళ్లతో గంటలకొద్దీ మాట్లాడి నా నాలుక ఎండిపోవాల్సిందే. వాక్యాలు వాటంతటవే పెదవుల మీదనుంచి పొంగివస్తూంటాయి వాళ్ళకి. అసంపూర్ణ వాక్యాలు కొన్ని, ముక్కలు ముక్కలుగా కొన్ని. అయితేనేం అర్థవంతంగా వుంటాయి. వాళ్లకది వాళ్ళతల్లి తరఫునుంచి అనూచానంగా వచ్చిన కళ. వాళ్ల మాటలో ఢిల్లీ విరుపు వుంటుంది.

మా మాతృభాష పర్షియన్. ఆ భాషను సమర్థించి ఆదరించింది మా పెద్ద నాన్నగారొక్కరే. ఆయన తన కొడుకులకి ఇంగ్లీష్ చెప్పించలేదు. ఆయన పర్షియన్ భాష అనర్గళంగా మాట్లాడగలరు. చక్కగా వ్రాయగలరు. కానీ ఆయనకు ఎప్పటికీ ఉద్యోగం రాలేదు. చాలా బీదరికం అనుభవించారు. అయినా మా అన్నతమ్ములకు పర్షియన్ చెప్పించమనేవారు. మానాన్నగారు సాధరణంగా ఆయన మాట జవదాటరు, కానీ ఈ విషయంలో మాత్రం గట్టిగా ఎదురుతిరిగారు. మగపిల్లలకి చెప్పించక పోతే పోనీ ఆడపిల్లలకు చెప్పిస్తే చెడుపు లేదుగా!! మా అక్కలు పర్షియన్ నేర్చుకుని పెళ్ళిళ్ళు చేసుకొని

వెళ్ళిపోయినప్పటిమాట అది! ఇక ప్రయోగానికి నేను మిగిలాను. దీన్ని మా అన్నలు అదనుగా తీసుకుని నన్ను ఏడిపించేవారు. తమ ఆధిక్యత చాటుకునేవారు. నాకు పర్షియన్ మీద అయిష్టం పుట్టుకొచ్చింది. మా పెద్ద నాన్నకి నాకు పర్షియన్ నేర్పించడం, నమాజ్ చేసుకోడం తప్ప వేరే పనేమీ లేదు. నేను వీలుచూసుకుని తిరగబడ్డాను. కాని తరువాత చాలా కాలానికి ఎప్పుడైనా  ఒక పర్షియన్ సాహిత్య గ్రంథం చూసినప్పుడు నాకొక దగ్గరతనమూ, హర్షాతిరేకమూ కలిగేవి. అప్పటికి మా పెద్దనాన్న చనిపోయారు. ఆయనకి కృతజ్ఞత కూడా చెప్పలేకపోయాను నేను. కాని పర్షియన్ భాష నాకు అంత తేలిగ్గా అనిపించదు. అంతేకాక మేము ఇంట్లో మాట్లాడే భాష చాలా చురకుగా సరళంగా వుంటుంది. అర్థంచేసుకోడానికి ఒక్క నిమిషం కూడా పట్టదు. మనం రోజూ మాట్లాడుకునే భాషలోనే ఎన్నో భావాలను వ్యక్తీకరించవచ్చు. అప్పటిలో నేను వ్రాసే భాష హిందీకి దగ్గరగా వుండేది. ఇంకా అది అంత చిక్క బడలేదు. అది మధురమైన భాష. ఇప్పుడది కేవలం ఢిల్లీ ఆగ్రా స్త్రీల పెదవులమీద మాత్రమే నిలిచివుంది.

నేనెప్పుడూ చదవడాన్ని ఎంత ఇష్టపడతానో వ్రాయడాన్ని కూడా అంత ఇష్ట పడతాను. నా జీవితంలోని అత్యంత ఆసక్తికరమైన సమయాలనూ, క్లిష్ట సమయాలనూ కూడా భరించేశక్తి నాకిచ్చింది నా రచనా వ్యాసంగమే. ఎన్నో బరువులను దింపుకునేలా చేసింది. ఎన్నింటినో వదిలించుకునేలా తోడ్పడింది. నా ఈ కలం నాకొక జీవికనిచ్చింది. ఒంటరి సమయాల్లో స్నేహాన్ని పంచింది. నా రచనా పుష్పక విమానంలోకి నేనెవర్నైనా ఆహ్వానించగలను. వచ్చినవారిని నేనేమైనా అనగలను. ఏడ్పించగలను. నవ్వించగలను. లేదా భస్మంకూడా చెయ్యగలను. ముక్కముక్కలు చేసి నాశనం చెయ్యగలను. ఒక తోలుబొమ్మలా ఆడించగలను. నేనొక సృష్టికర్త, లయకారణి కూడా!

నాతో పారస్పర్యం కల వారందరూ నా మనసుపై ఏదో ఒక ముద్ర వేసారు ? అజీమ్ భాయి తరువాత నా ఉపాధ్యాయులు, స్నేహితులు, పరిచయస్తులు ఎందరో ! డాక్టర్ అష్రఫ్ నా సమస్యలెన్నింటినో పరిష్కరించారు.

నేనెప్పుడు ఫజుర్ రెహ్మాన్‌ను (ప్రో వైస్ చాన్సెలర్, ఆలిగర్ ముస్లిమ్ యూనివర్సిటీ) కలిసినా ఆయన్ని ఒక నిఘంటువులాగా ఉపయోగించుకుంటాను. ఒక కవితనో ఒక నాటకాన్నో ప్రస్తావించండి, వెంటనే ఆయన దాన్ని అప్పచెప్పేస్తారు. ఆయనకి తెలియకుండానే ఆయన నాకెన్నో విషయాలు నేర్పించారు. ఇక షాహిద్ లతీఫ్ నా భర్తే కాదు నాకు గొప్ప స్నేహితుడుకూడా. చిక్కని స్నేహం మాది. మామూలుగా వివాహం స్నేహాన్ని చెరిపేస్తుంది అనుకుంటాం కాని మా స్నేహం మొండిగా నిలబడిపోయింది. అతను నా కథల్ని, నవలన్ని పునర్వీక్షించేవాడు. అతనితో ఎప్పుడూ చెప్పకుండానే అతని అభిప్రాయాలకు  బాగా విలువ ఇచ్చేదాన్ని. తప్పు దొరికితే చాలు తన ప్రజ్ఞ చూపించేవాడు.



ఆగ్రాలో మా ఇంటి చాకలి నాథూరాం నాకు మంచి మిత్రుడు. అతను స్వయంగా బట్టలు పట్టుకెళ్ళడానికి వచ్చి గొంతుకు కూర్చుని గంటల కొద్దీ కబుర్లు చెప్పేవాడు. ఏ పుస్తకాలలోనూ దొరకని ఎన్నో కథలు అతన్నుంచీ విన్నాను. వణికే ముసలి కంఠంతో ఆ కథల్ని పాడి వినిపించేవాడు. పాడుతూ తన వెండి ఉంగరం వున్న వేలితో తలుపుమీద దరువు వేసేవాడు. అయిదురూపాయలూ, దారిఖర్చులకి అదనంగా ఇంకొక రూపాయి ఇస్తే మమ్మల్ని తన కథల్తో నాలుగైదు గంటలు అలరించేవాడు. అడిగితే ఆ పాటల అర్థాలు బ్రిజ్ భాష లో వివరించేవాడు. అతన్నుంచీ వాళ్ళ భాష నేర్చుకున్నాను నేను.

కాలేజీలో చదివేటప్పుడు వివిధ మతాలను గురించి డాక్టర్ టక్కర్ ఉపన్యాసాలద్వారా తెలుసుకున్నాను. ఆయన మార్గదర్శకత్వంలో వాటి గురించి కొంత అధ్యయనం చేశాను. మతాలను గురించి మనసులో వున్న బూజునంతా దులుపుకోగలిగాను. బుద్ధిజం నన్నెంతో ప్రభావితం చేసింది. అన్ని సంకెళ్ళనూ తెంచుకుని కేవలం మానవాళే భగవంతుడనే దశకు చేరుకున్నాను. నా చిన్న నాటి  పొరిగింటి నేస్తం సుశి వివాహానికి మమ్మల్ని ఆహ్వానించారు. సంకుచిత మనస్తత్వంగల, కరడు కట్టిన మతభావాలున్న ఒక హిందువు ఇంకా మాతో సామాజిక స్నేహం నిలుపుకున్నందుకు నేను చాలా ఆశ్చర్యపోయాను. నాకు ఆ వివాహానికి వెళ్ళాలనిపించలేదు. ఒక ముస్లిమ్ అయిన కారణంగా జన్మాష్టమి రోజు నన్ను బయటికి గెంటేసిన సంఘటన నేను మర్చిపోలేదు. పైగా సుశి తల్లితండ్రులు కుదిర్చినతన్ని నోరుమూసుకుని పెళ్ళిచేసుకుంటోంది. స్వంత అభిప్రాయాలు లేకుండా. అయినా వెళ్ళాను. నన్ను చూడగానే నామనస్థితి అర్థంచేసుకుంది. వెంటనే నవ్వుతూ ఒక లడ్డు ఇచ్చింది. అప్పటికి తీసుకుని తరువాత పారేద్దామనుకున్నాను. కానీ తనే దాన్ని నా నోటికి అందించింది. నేను కొంచెం కొరకక తప్పలేదు. వెంటనే మిగిలినలడ్డు తను తినేసింది. అప్పటి సంఘటన తనూ మర్చిపోలేదన్నట్టుగా. గోడలు కూలి పోయాయి స్నేహానికి చేతులు సాచాయి. నేను తిరిగి వెళ్ళేటప్పుడు నాకు తనొక చిన్నికృష్ణుడి ఇత్తడి విగ్రహం ఇచ్చింది.

నేను ముస్లిమ్‌ని, విగ్రహారాధన మాకు పాపం. కానీ పురాణాలనేవి ఈ దేశపు వారసత్వ సంపద. యుగాల సంస్కృతీ, తత్వమూ అందులో మిళితమై వున్నాయి. మతం వేరు. జాతి, సంస్కృతి వేరు. ఈ దేశపు మట్టిలో, నీటిలో, గాలిలో, సూర్యరశ్మిలో నాకు సమాన భాగమున్నట్లే ఈ సంస్కృతిలోనూ వుంది. నేను హోలీకి రంగులు ఆడితేనూ దీపావళికి దీపాలు పెడితేనూ నా మత విశ్వాసాలు భంగమవుతాయా? నా విశ్వాసాలూ, వివేకమూ అంత తేలిగ్గా దెబ్బతినేటంత బలహీనమైనవా?

మనం చూసేవీ వినేవీ అన్నీ మన మనసుపై ముద్ర వేస్తాయి. ఈ ముద్రలన్నీ కలిసి ఒక పదంగా తయారౌతాయి. పదాలన్నీ కలిసి ఒక వ్యవస్థ తయారౌతుంది.

ఒక్కొక్కసారి ఈ ముద్రలు ముత్యాల బదులు గాయాలుగా మారతాయి. గాయాలపై గాయాలు పదాలను తయారుచెయ్యవు. శూన్యాన్ని మిగులుస్తాయి. దేశంలో ఎక్కడైనా హిందూ ముస్లిం మతకలహాలు జరిగాయని వింటే నాకలం నన్ను సతాయిస్తుంది. సుశితో పంచుకున్న లడ్డు నా గొంతులో ముళ్ళబంతి అయి, పేలిపోతానని భయపెడుతుంది. అప్పుడు నా అలమారలో దాచుకున్న బాలకృష్ణుడిని అడుగుతాను "నువ్వుకేవలం ఒక ఊహవేనా? కేవలం ఒక కవి ఊహల్లోంచి వచ్చిన వాడివేనా? నేను పుట్టిన నేలమీదనేగా నువ్వూ పుట్టింది? నువ్వు చెప్పే నిజం కేవలం ఒక అకాంక్షేనా? లేక నిరాధారమైన ఒక మూఢ నమ్మకమా? ఈ నేల తల్లి హృదయంలో దిగబడ్డ బాణాన్ని నువ్వు తొలగించలేవా?" అని.

కానీ ఇత్తడి విగ్రహంలో బిగుసుకుపోయిన ఆ దైవం, నా తెలివితక్కువ తనానికి నవ్వైనా నవ్వలేదు. ఈ నాటి రాజకీయ ప్రపంచంలో భగవంతుడు కేవలం ఒక లాభసాటి వృత్తిగా మారాడు. అపజయపు మరకలను అమాయకుల రక్తంతో శుద్ధి చేస్తున్నారు. ఒకరి అయోగ్యతని ఒకరు ఋజువుచేసుకోడం కోసం మనుషులు కుక్కల్లా కాట్లాడుకుంటున్నారు.

– ఇస్మత్ చుగ్తాయ్

---

c మొహర్రం పదవ రోజున కర్బలా యుద్ధంలో అమరులైన మహమ్మద్ కుటుంబీకుల సంస్మరణ జరుపుతారు ముస్లిములు. ఆ యుద్ధంలో ప్రాణాలు విడిచిన మహమ్మద్ ప్రవక్త మనవడు హుసేన్ కుటుంబాన్ని స్మరించుకుంటారు. హుసేన్ కొడుకు ఆలీ అస్ఘర్ ఆరు నెలల పసివాడు. శత్రువులు కాలువలో నీళ్ళకు సైనికులను కాపలా పెట్టి హుసేన్ తరపు వాళ్ళకు నీళ్లు లేకుండా చేశారు. గొంతెండిపోతున్న పసివాడిని అక్కడికి నీళ్ళకోసం తీసుకు వెడితే నీళ్లివ్వకుండా ఆ పిల్లవాడి గొంతుకి బాణంవేసి చంపారు శత్రువులు. కర్బలా యుద్ధంలో అమరుడైన అతి పిన్నవయస్కుడు ఆలీ అస్ఘర్.



# పరిచయం

శైలీ విన్యాసంలోనూ శిల్పపరిణతి లోనూ అగ్ర స్థానానికి ఎదిగి, తన సహ రచయిత్రులలో కూడా స్వీయ స్పృహను పెంచి, నిర్బంధమైన సృజనాత్మక అభివ్యక్తి వైపు నడిపించిన ఇస్మత్ చుగ్తాయ్, నిజాయితీ, ధైర్య సాహసాలకు మారుపేరు. ఆధునిక ఉర్దూ కథా సాహిత్యాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన రచయితలలో ముఖ్యులు. పంథొమ్మిది వందల ముప్పై, నలభైలలో భారత దేశంలో స్త్రీలు రచనలు చెయ్యడం చాలా అరుదు అని మనకి తెలుసు. స్త్రీల జీవితాలలో సాహిత్యానికి స్థానం లేదనుకున్న కాలంలో ఆ సంప్రదాయాన్ని ఛేదించి, తన రచనలతో, ఆ భ్రమలని చెదరగొట్టింది.

1944 లో ఉర్దూ సాహితీ సీమలో, సంచలనాత్మకమైన "లిహాఫ్" (రజాయి) అనే కథతో అడుగు పెట్టి, పాఠకులనూ సహ రచయితలనూ విస్మయ పరచింది. ఆరోజుల్లో స్త్రీలకి సంప్రదాయాలను ఎదిరించడం, ధైర్యంగా మాట్లాడడం అనేవి కలల్లో కూడా ఊహించలేని విషయాలు. కనుక ఆమెను విమర్శించిన వాళ్ళలో కొందరు, ఆ కథ వ్రాసింది పురుషుడేమో, "ఇస్మత్ చుగ్తాయ్" ఒక పురుషుని కలంపేరు కావచ్చేమో అనుకున్నారు. ఆమె వ్రాసిన చోటే (గాయాలు) అనే సంకలనానికి ముందుమాటలో "ఇస్మత్ పేరు వినగానే పురుష రచయితలకు మూర్ఛ వచ్చినంత పనౌతుంది. వాళ్ళు అయోమయ స్థితిలో పడతారు. చిన్నతనం అనిపిస్తుంది వాళ్లకి" అంటాడు కిషన్ చందర్. లిహాఫ్ కథకు ఆమె ఇచ్చిన సూచనప్రాయమైన ముగింపు గురించి మంటో (ఆమె సహ రచయిత, మిత్రుడు, ఆమెను బాగా విమర్శించిన వాడు కూడా) మొదట ఆశాభంగాన్ని ప్రకటించాడు. "ఎంతైనా ఆమె ఒక స్త్రీ" అన్నాడు. కానీ ఆమె రచనలు చదివి ఆమెను అర్థం చేసుకున్నాక తన అభిప్రాయం మార్చుకోక తప్పలేదు. "గంజే ఫరిష్తే" లో ఆయన ఇలా అన్నాడు, "ప్రాథమికంగా ఆమె ఒక స్త్రీ... కళను అభివృద్ధి చేసుకోవాలంటే ఎవరైనా తమ సహజ స్వభావానికి న్యాయం చెయ్యాలి. దాని పట్ల నిజాయితీగా వుండాలి. తను స్త్రీ కాకపోనట్లయితే అంత సున్నితమైన "భుల్ భులయ్యా" "తిల్" లిహాఫ్, గైండా వంటి కథలు వ్రాయగలిగేది కాదు."

ఇస్మత్ ఒక మధ్య తరగతి కుటుంబంలో ఉత్తర్ ప్రదేశ్ లోని బుడావ్ లో 1915 ఆగస్టు పదిహేను జన్మించింది. ఆరుగురు మగపిల్లలూ నలుగురు ఆడపిల్లల్లో తొమ్మిదవది. ఆమె తండ్రి మీర్జా కాసిమ్ బేగ్ నిజాయితీ గల ప్రభుద్యోగి. స్వయంశక్తితో డిప్యూటీ కలెక్టర్ అయ్యాడు. కంటోన్మెంట్ స్కూల్లో ఆడపిల్లలు తప్పనిసరిగా ఫ్రాకులు ధరించాలనే నియమం వుండేది ఆరోజుల్లో. వాళ్ల కుటుంబ సంప్రదాయానికి అది వ్యతిరేకం కనుక

ఇస్మత్ స్థానిక మున్సిపల్ స్కూల్లో చేరింది. అక్కలందరికీ ఈమె చిన్నతనం లోనే వివాహాలు అయి వెళ్ళిపోవడం వల్ల ఎక్కువగా అన్నలతోనే సాహచర్యం. అందువల్లనే తనకూ ధైర్యం అబ్బిందనీ తన రచనలలో నిర్భీకతకు కూడా అదే కారణం అంటుంది ఇస్మత్.

"మేం అందరం చాలా నిర్మొహమాటంగా వుంటాం. మా నాన్న, అన్నలు అందరం. మేం ఎప్పుడు వేరు వేరు గా కూర్చోలేదు. మా నాన్న అభ్యుదయ వాది. విశాల హృదయుడు. మా అన్నలతో సమానంగా చూసేవాడు నన్ను, నాకెప్పుడూ సిగ్గుపడుతూ వుండాలని అనిపించలేదు. ఆ పెంపకం వల్లనే నేనిలా వుండగలుగుతున్నాను" అంటుంది.

ఇస్మత్ చిన్నప్పుడు, ఆమె అన్న మీర్జా అజీమ్ బేగ్ ప్రఖ్యాత రచయిత. ఆయనే ఆమెకి తొలి సాహిత్య గురువు. ఆయన సలహాతోనే మొదట థామస్ హార్డీని జీర్ణించుకుంది. తరువాత అనేకమంది రచయితలను అధ్యయనం చేసింది. ఆపైన అనువాదంలో శిక్షణ. ఉర్దూ నుంచీ ఇంగ్లీష్‌లోకి ఇంగ్లీష్ నుంచి ఉర్దూకు. అన్న రచనలను చదివాక తనూ వ్రాయాలనే కోరిక కలిగిం,ది. హజబ్ ఇస్మాయిల్, మజ్నూ ఘోరక్ పురి, నియాజ్ ఫతే పూరీల భావుక రచనలు చదివితే ఆమెలోనూ అటువంటి సాహసపూరితమైన ఆలోచనలు కలిగాయి. ఆకథల్లో నాయకురాలిగా తననే ఊహించుకునేది. రహస్యంగా అలాంటి అసహజమైన భావోద్వేగాలూ, అత్యంత ఉత్కంఠా కలిగిన కథలు వ్రాసింది. తనకి తెలుసు వాటిని ఎవరైనా చూస్తే బాగా తిడతారనీ అవి మురికి కథలనీ, తరువాత అవి చాలా తక్కువ స్థాయి రచనలని అర్థం చేసుకుని వాటిని చింపేసి, సాహిత్యాధ్యయనాన్ని సీరియస్‌గా తీసుకుంది. దొస్తయవస్కీ, సోమర్సెట్ మామ్‌ల రచనలు ఆమెను బాగా ప్రభావితం చేశాయి. చెకోవ్ పై ప్రత్యేకాభిమానం కలిగింది. కథన పద్ధతి ఓ హెన్రీ నుంచీ నేర్చుకున్నాననీ అంటుంది. ఉర్దూ రచయితలలో ప్రేమ్‌చంద్ ఆమె అభిమాన రచయిత, టాల్ స్టాయ్, డికెన్స్ ప్రభావమూవుంది. తరువాత గాంధీ ప్రభావంతో ప్రేమ్‌చంద్, యూరప్ శైలిని జోడించి ఉర్దూ రచనలు చేశాడు.

కళాశాలలో చేరడంతో కొత్త జీవితం మొదలై రచన వెనకబడింది. "గుఫ్తగు" (సంభాషణ) అనే కథా సంకలనానికి వ్రాసుకున్న ముందు మాటలో, "బి.ఏ తరువాత ప్రపంచమే మారిపోతుంది. ఈ నాలుగేళ్ళల్లో ఎంతోపెరుగుతాం." అంటుంది... గ్రీక్ డ్రామాతో ప్రారంభించి, షేక్స్పియర్, ఇబ్సెన్, బెర్నార్డ్‌షా మొదలైనవారందర్నీ కూలంకషంగా అధ్యయనం చేసింది. చివరికి తన ఇరవై మూడో ఏట తనకి వ్రాసే అర్హత వచ్చిందని భావించింది. ఇంగ్లీష్‌లోనూ ఉర్దూలోనూ ఉత్తమ కాల్పనిక సాహిత్యం చదివింది. ఆమె మొదటి కథ "ఫసాది". (జగడాలమారి) "సాఖీ" అనే ఒక ప్రతిష్ఠాత్మకమైన సాహిత్య పత్రికలో ప్రచురింపబడింది. పాఠకులు అజీమ్ బేగ్ తన పేరు ఎందుకు



మార్చుకున్నాడా అని ఆశ్చర్యపోయారు. తన చిన్నచెల్లెలు 'మున్నీ రచయిత్రి ఎప్పుడయిందో ఆయనకీ తెలీదు.

1936 లో బి.ఏ పూర్తవుతూండగా ఇస్మత్ లక్నోలో జరిగిన అభ్యుదయ రచయితల సమావేశానికి హాజరైంది. ఆ సమావేశానికి మున్షీ ప్రేమ్ చంద్ కూడా హాజరయ్యాడు. ఈ సమావేశంలోనే ఆమె రషీదా జహాన్ ను మొదటిసారి కలిసింది. వృత్తిరీత్యా వైద్యురాలైన రషీదా జహాన్, సంకల్పశక్తీ, స్వతంత్రేచ్ఛా కల రచయిత్రి కూడా. ఆమె కథలూ, రేడియో నాటికలూ వ్రాసింది. ఆమె రచనలు'ఔరత్ ఔర్ దిగార్ అఫ్సానే 'అనే సంకలనంలో ప్రచురిత మయ్యాయి. ఇస్మత్ పై ప్రభావం చూపిన ఏకైక స్త్రీ ఈమే. 'ఆమె చాలా సాహసి. అన్నిరకాల విషయాలూ బాహాటంగా, నిస్సంకోచంగా మాట్లాడుతుంది. ఆమెను అనుకరించాలనిపించేది నాకు. నన్ను చాలా ప్రభావితం చేసింది ఆవిడ. స్వేచ్ఛగా ఆలోచించే వ్యక్తి. మనసు విప్పి మాట్లాడుతుంది' అంటుంది ఇస్మత్.

బి.ఏ తరువాత ఆగ్రాలో బి.టి కూడా చదివి బి.ఏ., బి.టి చేసిన తొలి ముస్లిం వనిత ఇస్మత్. కొంత కాలం బరేలీలో స్త్రీల కళాశాలకు ప్రిన్సిపల్‌గా పనిచేసింది. అప్పుడే ఆమె తండ్రి మరణించాడు. తరువాత కొన్నాళ్ళు జోధ్‌పూర్‌లో పనిచేశాక, ఇన్స్పెక్ట్రెస్ ఆఫ్ స్కూల్స్‌గా బొంబాయి వచ్చింది. ఆమె ఆగ్రాలో చదువుతుండగానే అక్కడ మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేస్తున్న షాహిద్ లతీఫ్‌తో పరిచయమైంది. అది స్నేహంగా పరిణమించింది ఇస్మత్‌కి ఇరవై తొమ్మిదేళ్ల వయస్సులో వివాహమైంది. తరువాత అతను ఫిల్మ్ డైరెక్టర్ అయ్యాడు. సినిమా ప్రపంచానికి చెందిన వ్యక్తితో ఇస్మత్ వివాహం ఆమె అన్న అజీమ్ బేగ్‌కి నచ్చలేదు.

వివాహానికి రెండునెలల ముందే ఆమె "లిహాఫ్" వ్రాసి, ఉర్దూ కథలో ఒక కొత్త ధోరణి ప్రవేశపెట్టింది. ఈ కథ ఒక తుఫాను సృష్టించింది. వైవాహక జీవితంలో తీవ్ర ఆశాభంగానికి గురైన స్త్రీ, బేగం జాన్, ఈమె నవాబు భర్తకి కనీసం అమెతో మాట్లాడే తీరిక లేదు. ఆమె ఒక పరిచారిక దగ్గర లైంగికంగానూ ఉద్వేగపరంగానూ ఉపశమనం పొందుతుంది. ఒక స్త్రీ చిన్ననాటి జ్ఞాపకాల రూపంలో వుంటుంది ఈ కథ. చిన్న పిల్ల ఉహల్లో నుంచీ వచ్చిన కథ కనుక అమాయకత్వంతో కూడిన ధైర్యమూ నిష్కాపట్యమూ కనిపిస్తుంది. బేగమ్‌కూ ఆమె పరిచారికకూ మధ్య వుండే స్వలింగ సంబంధాన్ని కళ్లకి కట్టినట్టు చూపిస్తూనే, చిన్న పిల్ల ద్వారా చెప్పించడం వలన, కథ చెప్పడంలో ఒక సున్నితత్వం వచ్చింది. ఈ కథ ప్రచురణ అయిన రెండు నెలలకు దాన్ని గురించి పెద్ద వివాదం చెలరేగింది. పాఠకులూ విమర్శకులు ఆమెనూ ఆమె కథనూ తీవ్రంగా విమర్శించారు. అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం అశ్లీలత కింద లాహోర్ కోర్టులో కేసు కూడా

పెట్టింది. లాహోర్‌లో ఆమెకు మంటో స్నేహం లభించింది. ఆమెకు మద్దతు తెలిపిన వారిలో ఆయన ఒకడు. అప్పటికి ఆయన కథ "ఠండా గోస్ట్" (చల్లటి మాంసం) మీద కూడా వివాదం జరుగుతోంది. ఇస్మత్ కేసు రెండు సంవత్సరాలు నడిచింది. కాని కోర్టు వారికి కథలో ఎటువంటి అశ్లీల పదాలూ దొరకనందున కేసు కొట్టివేశారు. ఇదొక యదార్థ విషయమని తన చిన్నప్పుడు తమ ఇంట్లో వాళ్ళు ఒక బేగమ్ గురించీ ఆమె పరిచారిక గురించి చెప్పుకుని నవ్వుకునే వాళ్లనీ ఆమె చెప్పింది. "వాళ్ళు అలా మాట్లాడుకుంటూ వుంటే నేనూ మా అన్నా మంచం కింద దాక్కునే వాళ్ళం. వాళ్ళకి కనిపిస్తే మాత్రం అక్కడినుంచి పొమ్మని కోప్పడేవాళ్ళు. అంటే వాళ్ళేదో నిషేధిత విషయాన్ని గురించి మాట్లాడు కుంటున్నారని అర్థమయ్యేది. అప్పుడు అర్థం కాకపోయినా వాళ్ళ మాటలు క్రమేపీ అర్థం అయ్యేవి. అంటుంది. లిహాఫ్ కథలో కథనం గూఢంగానూ సూచ్యంగానూ వుంటుంది." అంటూ ఆ కథ దృష్టి కోణాన్ని గురించి వివరించింది. అంతేకాక కథ ముగింపు వాక్యం "లిహాఫ్ చివరి కొస కాస్త పైకి లేచినప్పుడు నేనేం చూశానో చెప్పను గాక చెప్పను" కూడా ఈ కథ వ్రాసినప్పుడు రచయిత్రికి స్వలింగ సంపర్కం అనే విషయాన్ని గురించి అవగాహన స్వల్పమని అనిపిస్తుంది.

లిహాఫ్ కథ ఆ తరువాత రచనలకు ఒక శైలినీ స్వరాన్నీ ఇచ్చి, ఆమెను మంటో, కిషన్ చందర్, అహ్మద్ అలి, రాజేందర్ సింగ్ బేడి, అహ్మద్ నదీమ్ ఖస్మిల స్థాయిలో ఒక పరిణత రచయితగా నిలబెట్టింది. ఆమెకు బాగా గుర్తింపు తెచ్చిన కథ కూడా. అయితే ఉర్దూ సాహిత్య పాఠకులు ఇస్మత్ "లిహాఫ్" తరువాత ఇంకా కొన్ని మంచి కథలు వ్రాసిందన్న విషయాన్ని మర్చిపోతూ వుంటారు. కల్లు, చౌతీకా జోడా, హిందుస్థాన్ చోడ్ దో, దో హాథ్, తేడీ లకీర్, వంటి ఎన్నో విశేషమైన కథలు వ్రాసింది.

ఆమె సమకాలీన రచయితలందరి వలే ఇస్మత్ ను కూడా యూరపియన్ కాల్పనిక సాహిత్యమూ అందులోనూ 19 వ శతాబ్దపు రష్యన్ రచయితల రచనలూ బాగా ప్రభావితం చేశాయి. ఆమె, మరి కొందరు సమకాలీన రచయితలు ఒక కొత్త తరహా రచనకు నాంది పలికారు. సామాజిక విషయాలను పట్టించుకున్నప్పటికీ అవి కేవలం నీతిబోధకంగానో రాజకీయసంబంధంగానో వుండేవి కాదు. సామ్యవాద దృక్పథంతో, సంప్రదాయేతర శిల్పంతో కథ వ్రాయడానికి ప్రాముఖ్యం పెరిగింది. ఫ్రాయిడ్ సిద్ధాంతాల ప్రభావంతో ఈ నవ రచయితలు లైంగికత గురించి స్వేచ్ఛగా నిస్సంకోచంగా వ్రాయ బట్టారు. కథా రచన. రూపంలోనూ సారంలోనే కాక భాషలో కూడా గొప్ప పరిణామం వచ్చింది. వాస్తవ విషయాలను డొంకతిరుగుడుగా చెప్పడం మాని సూటిగా చెప్పటం కూడా ప్రారంభించారు. వారి శైలి సాహసోపేతమైనది, నవకల్పనలతో కూడినదీ, పాత్రల మానసిక స్థితిని విశ్లేషించడంలో, పరిస్థితులకు అద్దం పట్టడంలో అత్యంత వాస్తవికమైనది.



ఇస్మత్ వ్రాస్తున్న కాలం ఇంకా స్త్రీల కలాలకూ గళాలకు స్వేచ్ఛ లేని కాలం. సాంప్రదాయాలు రీతి రివాజులూ సమాజాన్ని గుప్పిట్లో వుంచుకున్న కాలం. స్త్రీలు కవితలు వ్రాయడం అనేది "బౌద్ధిక తిరుగబోతుతనం" (intellectual vagrancy) కింద జమకట్టబడేది. అయినప్పటికి కొంతమంది, బేగమ్ యెల్ ద్రమ్. హజబ్ ఇస్మాయల్, బేగమ్ నాజర్ సజ్జద్ లాంటివాళ్ళు వ్రాసారు. వీళ్ళకు కొంత ప్రచారం వచ్చినప్పటికీ వాళ్ళు వ్రాసిన వన్నీ భావుక ప్రేమకు సంబంధించినవో, లేదా సంస్కరణలను ప్రబోధించేవి గానో వుండి చాలా అవాస్తవికంగా వుండేవి. ఇస్మత్ కూడా మొదట్లో ఇటువంటి రచనలతో ప్రభావితమైంది. కాని త్వరలోనే వీటినుంచి విముక్తమైంది. సాహిత్యరంగంలోకి ఇస్మత్ ప్రవేశంతో స్ఫూర్తి పొందిన మరికొంతమంది రచయిత్రులు. ఖుర్రతులైన్ హైదర్, ముంతాజ్ షిరీన్, హాజీరా మస్రూర్, ఖదీజా మస్తూర్, రజియ సజ్జద్ జహీర్. తస్నీమ్ సలీమ్, సరళాదేవి, సాదిఖా బేగమ్, షకీలా అఖ్తర్ ప్రసిద్ధులు. తనకు తెలిసిన విషయాలపైనే ఎక్కువ దృష్టి పెట్టేది ఇస్మత్. ఒక సమిష్టి కుటుంబంలో పెరిగినందువల్ల అత్తగార్లూ, మేనత్తలూ, పిన్నులూ, పెద్దమ్మలూ వారి బిడ్డలు, నౌకర్లూ, ఇరుగుపొరుగులు (మొహల్లే వాలే) వీరందరూ ఆమె రచనల్లో కనిపిస్తారు. ఆమె వస్తువులెప్పుడూ వాస్తవ సంఘటనలే. చాలా కథల్లో ఆమె కూడా వుంటుంది. పాత్రలు ఆమె బంధువులుగా వుంటారు. అందువలన రచనకు మరింత సహజ పరిమళం అబ్బింది. ఎక్కువ కథలు ఆత్మకథాత్మకమైనవే. బిచ్చూ ఫూపీ (బిచ్చూ అత్తయ్య) "కుంవారి (కన్య) మొదలైనవి. అయితే ఇవి వాస్తవ సంఘటనలైనంత మాత్రాన వాటి కాల్పనిక సౌందర్యాన్ని ఏమాత్రం కోల్పోలేదు. ఆమె రచించిన ఉత్తమ నవల "తేడీ లకీర్" లో కథకురాలి బాల్యం ఇస్మత్ బాల్యానికి దగ్గరగావుంటుంది. అందులో దర్శనమిచ్చే అనేక పాత్రలు కూడా ఆమెకు తెలిసిన వారివి సన్నిహిత మిత్రులవీ అవడంతో వారికి కొంత కోపం కూడా వచ్చేది.

ఆమెలోని వస్తు పరిమితిని తీవ్రంగా విమర్శించిన వారున్నారు. అది కొంత నిజంకూడా కావచ్చు. దానికి కారణం తనకి బాగా తెలియని, అవగాహన లేని విషయాల గురించి వ్రాయకపోవడమే. ఆ పరిమితిలోనే ఆమె గొప్ప కళాత్మకత సాధించగలిగింది. స్త్రీల గురించీ, వారి జీవితాలపై సంస్కృతీ సంప్రదాయాల అదుపు గురించీ. భారతీయ సమాజంలో స్త్రీల స్థాయి గురించీ, ఆమె ఆర్తితో ఆవేదనతో, లోతుగా పరిశీలించింది. ఆమె కథలకు వస్తువులు ఎక్కువ ఇవే. ఆ కాలంలో స్త్రీలపై సామాజికంగా జరుగుతున్న అణచివేత, దానికి వ్యతిరేకంగా వారి పోరాటం, స్త్రీల మనస్తత్వం, వారికే స్వంతమైన అనుభూతులు ఆమె కథా వస్తువులు. ఇంత సంవేదనతో స్పృహతో. పఠనీయత చెడకుండా రచనలు చేసిన రచయిత్రులు అరుదేమో! ఇస్మత్ పాత్రలన్నీ ఆమె వలె మధ్య తరగతికి

చెందినవే. వాళ్ళకుండే పరిచయాలు, దగ్గర, దూరపు బంధువులు, నౌకర్లు (కల్లు), సఫాయిలు, (చేతులు) ఇరుగుపొరుగులు. ఇదొక సామాజిక అల్లిక. ఇందులోనించీ వివిధ కథలు, వివిధ వర్ణాలను సంతరించుకుని వివిధ దృక్కోణాలనించీ రూపుకడతాయి. ఇస్మత్ భాష సూటిగా నిరాడంబరంగావుండే సామాన్య జనుల వాడుక భాష. ఆమె పాత్రలు కూడా కథల కోసం సృష్టించిన పాత్రలు కావు. ప్రతిరోజు కంటికి కనపడే వ్యక్తులు, తన పెద్ద కూతురుకు వరుణ్ణి వెతకడానికి నానా పాట్లు పడ్డ కుబ్రా తల్లి (చౌతీ కా జోడా) మనకు తెలియనిదా? తన అన్నతో అతని కుటుంబంతో ఎప్పుడూ యుద్ధానికి కాచుకు కూర్చుని చివరికి ఒక స్త్రీగా చెల్లిగా తన నిజ స్వరూపాన్ని దాచి పెట్టుకోలేక పోయిన బిచ్చూ అత్తయ్య, మనలో మనిషే. అలాగే, వగలమారి నల్ల పిల్ల గోరీ (చేతులు) వీళ్ళంతా మన ఇళ్ళలో చిన్నప్పుడు చూసిన వాళ్ళే! వాళ్ళ ప్రవర్తన మనకి ఏ వ్యూహం కలిగించకపోగా వాళ్ల పట్ల సానుభూతి, వాళ్ల భవిష్యత్తు పట్ల ఆవేదన కలుగుతాయి.

“ఇస్మత్ కథలు వేగంగా పరిగెత్తడమేకాదు, వాక్యాలు భావ చిత్రాలు, రూపకాలంకారాలు, ధ్వనులు, పాత్రల సంవేదనలు, అనుభూతులు ఒక తుఫానులా ముప్పిరిగొంటాయి.” అంటాడు కిషన్ చందర్.

ఉపమ, రూపకాలంకారాలను, ఉర్దూ నుడికారాన్ని సమయోచితంగా వాడుకోడంలో, భావ చిత్రాలను చొప్పించే సౌలభ్యంలో స్పష్టతలో, భాషానాణ్యతలో ఇస్మత్ తన సమకాలీన రచయితలను అధిగమించింది.

ఆమె సమకాలీన రచయితల తొలి రచనలలో, శైలిలోనూ వస్తువు ఎంపికలోనూ కొన్ని లోపాలు కనిపిస్తాయి. ఇవి బాలారిష్టాల కింద కొట్టిపారేస్తూ వుంటాం. ఇస్మత్ తొలి కథల్లోనే ఒక శక్తివంత మైన దృక్పధాన్నీ, వస్తువును ఆవిష్కరించడంలో పరిణతినీ చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. స్త్రీలు సామాజికంగానూ సాహిత్యపరంగానూ శృంఖలాలను తెంచుకోడానికి ప్రయత్నిస్తున్న కాలంలో వినపడిన ఏకైక గొంతు ఆమెది. ఇస్మత్ సృజనాపాటవాన్ని గురించి ప్రఖ్యాత ఉర్దూ సాహిత్య విమర్శకుడు ఎహతేషామ్ హుస్సైన్ ఇలా అంటాడు.

“ఇస్మత్ శక్తివంతమైన అభివ్యక్తీ, నిర్భీతితోకూడిన మేధాశక్తీ. చక్కగా కలిసిపోయినందువల్లనే ఆమె కథలు మొదటినుంచే అందర్నీ ఆకట్టుకున్నాయి. మొదట్లో ఆమె కూడా సామాజిక రుగ్మతలనుమాత్రమే శోధించి గాయాలను రేపి, వాటిపై ఉప్పు చల్లి, పాఠకులను ఒక సందిగ్ధస్థితిలో పడేసిందన్నది నిజమే. కానీ సత్వరమే ఆ విషయాన్ని తెలుసుకుని తన ప్రతిపాదితాంశానికీ సంఘటనలకూ మేలైన సమతూకాన్ని సాధించింది.”

ఇస్మత్ కథలను ఆనాటి సామాజిక సాంస్కృతిక విశేషాలను తెలిపే సమాచారం కోసం కూడా చదవవచ్చు. ఆమె కథలను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తే అప్పటి



ఉత్తర్ ప్రదేశ్‌లోని ముస్లిమ్ కుటుంబాల సామాజిక సాంస్కృతిక జీవితాన్ని బాగా అర్థం చేసుకోవచ్చు. వర్గ స్పృహ, వస్త్ర ధారణ, వంట పద్ధతులు, ఆహారం, సామాజిక పారస్పర్యం, పుట్టుక, వివాహం మరణాల సందర్భంలో పాటించే ఆచారాలు ధర్మాలూ, అన్నీ వివరంగా దొరుకుతాయి. ‘ చౌతీ కాజోడా’ లో పెళ్ళి సంబంధాలు కుదరడాన్నీ కుదుర్చుకోడాన్నీ గురించి వ్రాసింది. ఈ పద్ధతికి కాలం చెల్లిందనుకోడం పొరపాటు. ఇండియాలోనూ, పాకిస్తాన్‌లోనూ ఇంకా అట్లాగే పెళ్ళిళ్ళు కుదురుతున్నాయి. పెళ్ళి కావలసిన పిల్ల కుబ్రా అయితే. ఆమె చెల్లెల్ని కాబోయే పెళ్ళికొడుకుతో పరిహాసాలాడడానికి పంపుతారు తల్లీ, ఆమె స్నేహితురాలు. అతన్ని ఆకర్షించి అతనినుంచే పెళ్ళి ప్రతిపాదన రాబట్టాలనేది ఆ యుక్తి. ఆ ప్రతిపాదన కూడా తాను చూసిన అమ్మాయితో కాదు. పెళ్ళివరకూ చూడ నోచుకోని వ్యక్తితో. ఆ కథతో ముస్లిమ్ వధువులు వివాహం తరువాత నాలుగవరోజున ధరించే దుస్తుల (చౌతీ కా జోడా) కున్న ప్రాధాన్యాన్నీ, అవి తయారుచేసే పద్ధతినీ కూడా తెలుసుకోవచ్చు. ఆ “జోడా”కు వాడే బట్టను ఎలా కొలిచి, మడిచి కత్తెర లేకుండా చేతులతోనే లోపరహితంగా చింపి కుడతారో కూడా తెలుస్తుంది. “నివాలా (ఒక ముద్ద) అనే కథలో కూడా మరొకవిధమైన పెళ్ళిప్రయత్నాన్ని చూస్తాం. ఈ కథలో బొంబాయిలో వుండే “చాల్' వాతావరణం కూడా చిత్రితమైంది. ‘ముఖద్దస్ ఫర్జ్ ( పవిత్ర కర్తవ్యం) “కథలో ప్రస్తుత భారతదేశంలో లౌకిక వాద దృక్పధం అవసరాన్ని ప్రస్తావించింది. యువత ఇంక తాము హిందువులమా, ముస్లిములమా అని ఆలోచించదు. వాళ్ళు భారతీయులుగా వుండడానికే ఇష్టపడతారు. “ఘూంఘట్” (మేలిముసుగు) కథ వివాహ వ్యవస్థ పదఘట్టనల కింద నలిగిపోయిన ఒక స్త్రీ విషాద గాథ.

ఉర్దూ భాష పరిణామాన్ని అధ్యయనం చేసే వాళ్ళు,ఇస్మత్ కథలలో ఒకప్పటి ఉర్దూ నుడికారాన్ని పట్టుకోగలుగుతారు. “అమర్ బెల్ (అమృతలత)” అనే కథలోని ఈ వాక్యాలు చూడండి. అనువాదంలోనే ఇలా వుంటే ఇంక మూలంలో ఎంత గొప్పగా వుండి వుంటాయో!

“ఈ అయిదుగురు పాండవులతో, ఇమ్తియాజీ అత్తయ్య నూరుగురు కౌరవుల బలంతో పోరాడగలదు.”

“ఆమె శరీరం బాగా మర్దన చేసి పైన వెన్నరాసిన చపాతీ పిండిలా వుంటుంది.”

“మరీ తెల్లగా వుండే ఆమె చర్మం, వెండితో కల్తీ చేయబడిన బంగారంలా వుంటుంది.”

“ఆయన ఒకప్పుడు మల్లెమొగ్గలతో పోల్చిన ఆమె వేళ్ళు, ఇప్పుడు తన కళ్ళు పెరకడానికి వొస్తున్న డేగ గోళ్ళ లాగా కనిపిస్తున్నాయి.”

ఆమె మొదటి సంకలనం "కలియా (మొగ్గలు) 'రెండవ సంకలనం "చోటే (గాయాలు)' అజీమ్ బేగ్ చుగ్తాయ్ జీవిత కాలంలోనే ప్రచురింపబడ్డాయి. ఆమె మరికొన్ని పుస్తకాలు "ఏక్ బాత్" (కథా సంకలనం), తేడీ లకీర్ (నవల) చుయి, ముయి (కథా సంకలనం) జిద్ది (నవలిక) మాసూమా (నవలిక) ధని బంక్పన్ (కథా సంకలనం) దో హాథ్ (కథా సంకలనం) హమ్ లోగ్( వ్యాసాలు) షైతాన్ ( నాటకాలు) సౌదాయి (నవల), ఏక్ ఖత్ర ఎ ఖూన్ (నవల) ఇవికాక ఆమె భర్త షాహీద్ లతీఫ్‌తో కలిసి అయిదు సినిమాలకు రచన చేశారు. సినిమాలు కూడా తీశారు.

ఇస్మత్‌కు ఇద్దరు కూతుళ్ళు.ఆత్మ కథ ఎందుకు వ్రాయలేదని అడిగినప్పుడిలా చెప్పింది.'ఇప్పుడెందుకు ప్రచురించడం? నేను పోయాక ప్రచురించవచ్చు. నేనిప్పుడే ఎందుకు పోవాలి? నేను నా ఆత్మకథలో నిజాలే వ్రాయాలనేముంది? ఇప్పుడు ఆలోచించేది పరువుగురించేకదా? అన్నది. ఇస్మత్ 1991లో మరణించింది.

తాహిరా నఖ్వీ

---

తాహిరా నఖ్వీ ఇస్మత్ కథలనూ, పాకిస్థానీ కథలను విస్తృతంగా ఇంగ్లీషులోకి అనువదించారు. కొలంబియా, న్యూయార్క్ యూనివర్శిటీల్లో ఉర్దూ బోధించిన ఈమె మర్శకురాలిగా, అనువాదకురాలిగా, రచయిత్రిగా గొప్ప పేరు గడించారు.



# లిహాఫ్

వణికించే శీతాకాలంలో లిహాఫ్ (రజాయి) లో వెచ్చగా ముడుచుకు పడుకున్నప్పుడల్లా, గోడమీద దాని నీడ ఒక ఏనుగులా కదులుతున్నట్లే అనిపించి, నా మనస్సు గతంలోని చీకటి గుహల్లోకి వెళ్ళిపోతుంది. గత స్మృతులు వరదలా ముంచెత్తుతాయి.

ఇదేమీ నా లిహాఫ్‌కి సంబంధించిన ప్రణయానుభవపు మధుర జ్ఞాపకం కాదు. నాకూ నా లిహాఫ్‌కీ అటువంటి భావుకతతో కూడిన అనుభవాలేమీ లేవు. కంబళికి లిహాఫ్ కన్న వెచ్చ దనం తక్కువే కానీ, ఇది గోడమీద భయంకరమైన నీడలు పడనివ్వదు కనుక అదే మంచిదేమో!

అది నాకు బాగా చిన్నప్పటి ముచ్చట. నేను మా అన్నలతో, వాళ్ల స్నేహితులతో ఎప్పుడూ పోట్లాడుతూ వుండేదాన్ని. ఒక్కొక్కసారి నేనంత తగాదాలమారిని ఎందుకయ్యానా అని ఆశ్చర్య పడేదాన్నికూడా, నావయస్సులో మా అక్కలు అభిమానులను సంపాదించడంలో హడావిడిగా వుండేవాళ్ళు. నేను ఎప్పుడెవరితో ముష్టి యుద్ధానికి దిగుదామా అని చూస్తుండేదాన్ని.

ఈ కారణంగా మా అమ్మ ఆగ్రా వెలుతూ నన్ను తన సోదరిలాంటి బేగమ్ జాన్ దగ్గర వదిలింది. ఆ సోదరి ఇంట్లో పిల్లలు లేకపోగా, కనీసం ఒక్క పెంపుడు జంతువు కూడా లేదని అమ్మకి తెలుసు. మరి నేనెవరితో యుద్ధం చెయ్యాలి? నాకు పడ్డ ఈ శిక్షకు నేను నిజంగా అర్హురాలినే అనిపించింది. సరే, అమ్మ నన్ను బేగమ్ జాన్ దగ్గర వదిలిందన్నాను కదా! ఎవరి లిహాఫ్ నా జ్ఞాపకాలమీద ఎన్నటికీ మరుపురాని వాత పెట్టిందో ఆ బేగమ్ జాన్ దగ్గర!

ఆమె తల్లితండ్రుల బీదరికం కారణమైతేనేం, ఆమె మీద ప్రేమతో నైతేనేం, పరువం దాటిపోయిన నవాబ్ సాహెబ్ కిచ్చి పెళ్ళిచేశారు బేగమ్ జాన్‌ని. సంపదా, వంశప్రతిష్టా కల వ్యక్తి నుంచీ సమాజం సత్ప్రవర్తననూ, దాన శీలతనూ ఆశిస్తుంది కనుక, అవి ఆయనకు తప్పనిసరి అయ్యాయి. అందుచేత ఆయన ఇంట్లో ఎవరూ ఎన్నడూ వీధి మనుషులనుగానీ, ఉంపుడుకత్తెలను కానీ చూడలేదు. ఆయన స్వయంగా హాజ్ యాత్రకు వెళ్లడమే కాక, వెళ్ళే బీద వాళ్లకు ఆర్థిక సాయం కూడా చేస్తాడు. అంత పవిత్రమైన మనిషి!

కొంతమందికి పావురాలు పెంచడం సరదా, కొంతమందికి కోడి పందేల సరదా వుంటుంది. నవాబ్ సాహెబ్ ఇటువంటి చీదర పుట్టే సరదాలకు దూరంగా వుంటాడు

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1008**

* * *